# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 01-01-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

❖ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని 69,515 కోట్ల రూపాయలకు పెంచామని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

❖ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

❖ రక్షణ రంగంలో సంస్కరణలకు ఊతమిచ్చేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ 2025ను సంస్కరణల సంవత్సరంగా ప్రకటించింది.

❖ బాస్మతియేతర తెల్ల బియ్యం వాణిజ్యానికి సంబంధించి భారత్ - ఇండోనేషియా మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు.

❖ వన్ నేషన్, వన్ సబ్ స్క్రిప్షన్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ఈ రోజు నుంచి ప్రారంభించింది.

========================

దేశవ్యాప్తంగా రైతుల కోసం తీసుకొచ్చిన “ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన” పథకాన్ని పొడిస్తూ కేంద్రమంత్రివర్గం నిర్ణయం తీసకుందని సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం ఈ రోజు న్యూఢిల్లీలో సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రిమండలి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆ వివరాలను అశ్వినీ వైష్ణవ్ పాత్రికేయులకు వివరిస్తూ... ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని 69,515 కోట్ల రూపాయలకు పెంచామని తెలిపారు. ఈ పథకం కింద బీమా తీసుకున్న రైతుల్లో 88 శాతం మంది చిన్న, సన్నకారు రైతులేనని వెల్లడించారు. గత 8 సంవత్సరాల్లో రైతులకు లక్షా 70 వేల కోట్ల రూపాయల పరిహారం అందించామని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 40 సెకన్లు)

========================

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఈ రోజు ఆయన అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం న్యూఢిల్లీలో సమావేశమైంది. క్యాబినెట్ నిర్ణయాలను ఆయన ప్రస్తావిస్తూ... ఈ సంవత్సరంలో మొదటి కేబినెట్ రైతుల శ్రేయస్సును పెంపొందించడానికి అంకితమైందని అన్నారు. దేశానికి అన్నం పెట్టేందుకు కృషి చేస్తున్న రైతులందరినీ చూసి భారత్ గర్విస్తోందన్నారు.

========================

రక్షణ రంగంలో కొనసాగుతున్న, భవిష్యత్ సంస్కరణలకు ఊతమిచ్చేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ 2025ను సంస్కరణల సంవత్సరంగా ప్రకటించింది. నూతన సంవత్సరం సందర్భంగా రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ఆ మంత్రిత్వ శాఖ కార్యదర్శులతో ఈ రోజు కీలక సమావేశం నిర్వహించి వివిధ ప్రాజెక్టులు, సంస్కరణల పురోగతిని సమీక్షించారు. సాయుధ దళాలను సాంకేతికంగా అభివృద్ధి చెందిన, బహుళ, సమగ్ర సామర్థ్యం కలిగిన యుద్ధ-సిద్ధంగా ఉన్న దళంగా మార్చడం ఈ సంస్కరణల యొక్క ప్రధాన ఉద్దేశ్యం. సాయుధ దళాలు ప్రపంచ సైనిక సామర్థ్యాలలో ముందువరసలో ఉండేలా చూడటం ఈ సంస్కరణల మరో లక్ష్యం.

========================

వన్ నేషన్, వన్ సబ్ స్క్రిప్షన్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ఈ రోజు నుంచి ప్రారంభించింది. పరిశోధన పత్రాలు, జర్నల్స్, విద్యా సంబంధిత విషయాలతో సహా విస్తృత శ్రేణి డిజిటల్ జ్ఞాన వనరులకు ఒకే సబ్ స్క్రిప్షన్ కింద ఎటువంటి అంతరాయం లేకుండా అందించడం ఈ పథకం లక్ష్యం. ఈ పథకం దేశవ్యాప్తంగా విద్యార్థులు, పరిశోధకులు, సంస్థలకు ప్రయోజనం చేకూరుస్తుందని భావిస్తున్నారు. విశ్వవిద్యాలయాలు, ఐఐటీలతో సహా ప్రభుత్వ నిధులతో నడిచే ఉన్నత విద్యా సంస్థలకు చెందిన 1.8 కోట్ల మంది విద్యార్థులకు ప్రపంచ వ్యాప్తంగా ప్రముఖ జర్నల్స్ లో ప్రచురితమైన పరిశోధనా పత్రాలు అందుబాటులో ఉంటాయి. సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మెడిసిన్, మ్యాథమెటిక్స్, మేనేజ్మెంట్, సోషల్ సైన్సెస్, హ్యుమానిటీస్కు సంబంధించిన 13 వేల 400 అంతర్జాతీయ జర్నల్స్ ను తొలి దశలో పరిశోధకులకు అందుబాటులో ఉంచనున్నారు. 3 సంవత్సరాల కాలానికి ఆరు వేల కోట్ల రూపాయల బడ్జెట్ తో ఈ పథకం నిర్వహిస్తున్నారు.

========================

శ్రీలంక నావికాదళం సంవత్సరం క్రితం అరెస్టు చేసిన 20 మంది భారత జాలర్లను ఈ రోజు విడుదల చేశారు. కొలంబో నుంచి విమానంలో తిరిగి వచ్చిన వీరికి చెన్నై విమానాశ్రయంలో అధికారులు స్వాగతం పలికారు. ఇరు దేశాల ప్రభుత్వాల జోక్యంతో భారత జాలర్లు విడుదలయ్యారు. ఇటీవల శ్రీలంక అధ్యక్షుడి భారత పర్యటన సందర్భంగా ఈ అంశంపై చర్చించారు.

========================

బాస్మతియేతర తెల్ల బియ్యం వాణిజ్యానికి సంబంధించి భారత్, ఇండోనేషియా మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. ఈ రోజు ఆయన ఢిల్లీలో పాత్రికేయులతో మాట్లాడుతూ... భారత్ 10 లక్షల మెట్రిక్ టన్నుల బాస్మతియేతర బియ్యాన్ని ఎగుమతి చేయనుందన్నారు. రైతులకు సరసమైన ధరకే డీఏపీని అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించందని కేంద్రమంత్రి వివరిస్తూ...

(వాయిస్ 35 సెకన్లు)

విరామం

========================

ఉత్తర గుజరాత్ లో ప్రస్తుతం ఉన్న బనస్కాంత జిల్లాను విభజించి వావ్-తారాడ్ అనే కొత్త జిల్లా ఏర్పాటు చేసేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇది తారాడ్ కేంద్రంగా గుజరాత్ లోని 34వ జిల్లా ఏర్పడనుంది. నవ్సారి, వాపి, ఆనంద్, నదియాద్, మెహసానా, సురేంద్రనగర్, మోర్బి, పోర్బందర్, గాంధీధామ్ సహా రాష్ట్రంలోని 9 మున్సిపాలిటీలకు మునిసిపల్ కార్పొరేషన్ హోదా కల్పించే ప్రతిపాదనకు సైతం రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో రాష్ట్రంలో 17 మున్సిపల్ కార్పొరేషన్లు, 149 మున్సిపాలిటీలు ఏర్పడనున్నాయి.

========================

ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా భారత వైమానిక దళానికి చెందిన వెస్ట్రన్ ఎయిర్ కమాండ్ అధిపతిగా ఈ రోజు బాధ్యతలు స్వీకరించారు. 1986 డిసెంబర్ లో భారత వైమానిక దళంలో ఆయన ఫైటర్ పైలట్ గా చేరారు. 38 సంవత్సరాల సర్వీసులో ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా ముఖ్యమైన కమాండ్ స్టాఫ్ నియామకాలను చేపట్టారు. 39 ఏళ్ల సర్వీసు తర్వాత పదవీ విరమణ చేసిన ఎయిర్ మార్షల్ పంకజ్ మోహన్ సిన్హా స్థానంలో ఎయిర్ మార్షల్ మిశ్రా నియమితులయ్యారు.

========================

అమెరికాలో జరుగుతున్న వరల్డ్ బ్లిట్జ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు చెందిన ఆర్.వైశాలి కాంస్య పతకం సాధించింది. క్వార్టర్ ఫైనల్స్‌లో మహిళల విభాగంలో చైనాకు చెందిన జు జినార్‌పై ఆమె 2.5 - 1.5 తేడాతో గెలిచింది. సెమీస్‌లో చైనాకు చెందిన వెంజున్ చేతిలో 0.5-2.5 తేడాతో ఓడిపోయింది. చెస్ ప్రపంచ మాజీ ఛాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ వైశాలికి అభినందనలు తెలిపారు. ఆమె దేశం మరింత గర్వపడేలా చేసిందని సామాజిక మాధ్యమ వేదికగా పేర్కొన్నారు.

========================

దేశీయంగా తయారైన నీలగిరి, సూరత్, వాఘ్షీర్ యుద్ధనౌకలను ఈ నెల 15వ తేదీన ముంబైలోని నేవల్ డాక్ యార్డ్ లో భారత నౌకాదళం ప్రారంభించనుంది. నీలగిరి యుద్ధనౌకలో స్టెల్త్ ఫీచర్లు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉన్నాయి. సూరత్ డిజైన్, సామర్థ్యాలలో గణనీయమైన మెరుగుదలను కలిగి ఉంది. అత్యాధునిక ఏవియేషన్ సౌకర్యాలతో కూడిన నీలగిరి, సూరత్ లలో ఎటువంటి సమయంలోనైనా అనేక రకాల హెలికాప్టర్లను నడపవచ్చు. వాఘ్షీర్, ప్రపంచంలోని అత్యంత నిశ్శబ్ద , బహుముఖ డీజిల్-ఎలక్ట్రిక్ జలాంతర్గాముల్లో ఒకటి. ఈ మూడు యుద్ధ నౌకలను ప్రారంభించడం భారత నావికాదళం పోరాట సన్నద్ధతను, స్వదేశీ నౌకా నిర్మాణంలో దేశ అసమాన పురోగతిని తెలియజేస్తున్నది. ముంబైలోని మజగావ్ డాక్ షిప్ బిల్డర్స్ లిమిటెడ్ లో ఈ మూ డింటిని పూర్తిగా డిజైన్ చేసి నిర్మించినట్లు భారత నౌకాదళం తెలిపింది.

========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు కొత్త సంవత్సరాన్ని లాభాలతో ప్రారంభించాయి. సెన్సెక్స్ 78,139 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై 78,756 పాయింట్ల వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.64 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 74 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

========================

దేశంలోని ఉత్తర ప్రాంతాన్ని దట్టమైన పొగమంచు చుట్టు ముట్టడంతో పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఢిల్లీ వెళ్లాల్సిన 22 రైళ్లు రెండు గంటల వరకు ఆలస్యంగా నడిచాయని భారతీయ రైల్వే తెలిపింది. వీటిలో అయోధ్య ఎక్స్ ప్రెస్, పాతాళ్కోట్ ఎక్స్ ప్రెస్, కైఫియత్ ఎక్స్ ప్రెస్, సంపర్క్ క్రాంతి ఎక్స్ ప్రెస్, గోండ్వానా ఎక్స్ ప్రెస్, తెలంగాణ ఎక్స్ ప్రెస్, పద్మావత్ ఎక్స్ ప్రెస్ లు ఉన్నాయి. ప్రయాణికులు రైలు ఎక్కడానికి స్టేషన్ కు వచ్చే ముందు వాటి తాజా స్థితిని చూసుకోవాలని రైల్వే అధికారులు సూచించారు.

========================

గత సంవత్సరం డిసెంబరులో వస్తు, సేవల పన్ను (GST) వసూళ్లు లక్షా 77 వేల కోట్ల రూపాయలు వసూలైందని కేంద్రం తెలిపింది.

========================

========================